

# సుపుత్రుడు

"నువ్విటువంటి పనులు చేశావంటే నయాపైసాకి పనికిరావు... ఇప్పుడే చెపుతున్నాను..." అన్నాడు నరసయ్య.

నారాయణ తలవంచుకుని, గోడ కానుకుని నిలబడ్డాడు.

"వాడిని అలాగే రాచిరంపాన పెడుతూ ఉండండి... వాడు బాగుపడేదేమిటి..." అంది వర్ధనమ్మ.

ఎవరూ ఆమె మాటలు పట్టించుకోక పోయేటప్పటికి వర్ధనమ్మ చేతిలో ఉన్న గిన్నె నేలమీద ఖంగునపడేసి వంటింట్లో నుంచి చరచరా బయటకువచ్చి "అలా ఎంతసేపు సాధిస్తారండి వాడిని... మీ రన్నాలు తినిపోతే నాకు బోలెడంత పని ఉంది ..." అని విసుక్కుంది.

"అయితే నా మాట ఎవరికీ లెక్క లేదన్నమాట. .." అన్నాడు. నరసయ్య.

"లెక్కలేకేమండీ... బోలెడంత ఉంది ఎప్పుడూ 'నా. . నా...' అని మీ సంగతేకాని నా సంగతి చూసేదెవరండి... కంచాలు కడగాలా, ఇల్లు కడుక్కోవాలా, ఇంట్లో ఏమన్నా పది మంది నౌకర్లు పని చేస్తున్నారనా... నడుములు విరక్కొట్టుకుని చాకిరీ చేస్తుంటే ఏమీ కనబడటంలేదు..." అన్నం వండాను, తినిపొండి. "అంటే ఇంత రాద్ధాంతం చేస్తున్నారు" అంటూ వర్ధనమ్మ ఏకరువు పెట్టింది నరసయ్య ధూం.... ధాం లాడుతూ నారాయణ

చెయ్యిపట్టుకుని వంటింట్లోకి ఈడ్చుకుపోయి పీటమీద కుదేసి "తినరా...అన్నం తిను..." అని వర్ధనమ్మవైపు "ఇలాగే దున్నపోతులాగా మేపు బాగుపడతాడు..." అన్నాడు అక్కసంతా వెళ్ళబోసుకుంటూ.

'అహాఁ....లేదు...అలా చేతులు విరగ్గొట్టి పీటమీద కుదెయ్యండి... బాగుపడతాడు.... తిన్నాడో... తిన్నాడో అని వకటే గొడవకాని... నాకు తెలియక అడుగుతాను వాడొక్కడే తింటున్నాడా ఈ ఇంట్లో" అంది వర్ధనమ్మ. నరసయ్యకు అరికాలు మంట నెత్తికెక్కింది.

"ఇంతకీ వాడేం చేశాడో తెలిసే మాట్లాడుతున్నావా..." అన్నాడు నరసయ్య.

"మీకు తెలిసింది చెప్పరాదూ... నాచేత అడిగించుకోవడం ఎందుకూ...' అంది వర్ధనమ్మ.

"కుర్రకుంకగదా అని తమాయించుకుని ఊరుకుంటుంటే పేట్రేగిపోతున్నాడు. మన వెంకయ్యగారి దొడ్లో మామిడికాయలు కోసుకొచ్చాడుట. ఎందుకొచ్చిన బుద్ధులు... మన వంశంలో ఎక్కడన్నా ఉందా..." అన్నాడు నరసయ్య.

వర్ధనమ్మ పగలబడి నవ్వింది 'మీ వంశంలో లేని బుద్ధులు వాడికి ఎక్కడినుండి వస్తాయి...." అంది. అని "కుర్రకుంక అని మీరే అంటుండిరి.. కుర్రకుంకలు కాకపోతే మనం ఎక్కుతామటండీ చెట్లు...." అంది. వర్ధనమ్మ నవ్వు తెరలు తెరలుగా వస్తుంటే నరసయ్యకు నవ్వాలో ఏడవాలో తెలియక "సరే ఏదో ఏడవండి..." అని విసుక్కున్నాడు.

నారాయణ ఏడుపు ముఖం పెట్టి అన్నం తినటానికి ఉపక్రమించాడు. నరసయ్య గబగబా ఇన్ని అన్నంమెతుకులు నోట్లో వేసుకుని బయటపడ్డాడు. నారాయణ మటుకు మెల్లిగా అన్నం నములుతూ కూర్చున్నాడు

"తొందరగా తెములు.. " అంటూ విసుక్కుంది వర్ధనమ్మ. నారాయణ బుంగమూతి పెట్టి "అమ్మా. .. పెరుగే..." అన్నాడు. వర్ధనమ్మ 'ఇంత' గడ్డ పెరుగు వేసి "వాళ్ళింట్లో కాయలు కోసుకుని రావచ్చా. తప్పుకాదు నాయనా... వాళ్ళెవరన్నా చూస్తే కొడతారు, తిడతారు...." అంది.

"నేను కోస్తున్నప్పుడు ఎవరూ చూడలేదే..." నారాయణ తన ప్రయోజకత్వాన్ని విపులీకరించాడు.

"జాగ్రత్త నాయనా... ఇవ్వాళ చూడకపోతే రేపు చూస్తారు... నీకేమన్నా కావాలంటే నన్నడుగుతూ ఉండు" అంది.

"అయితే అమ్మా... ఒక అణా కావాలే..." అన్నాడు.

"ఓరి నీ డబ్బు తాపం ఇది కాను. చెయ్యి కడుక్కుని రారా..." అంటూ పంపించింది. నారాయణ చెయ్యి కడుక్కుని వచ్చి తల్లిదగ్గర అణా తీసుకుని లాగూ జేబులో వేసుకుని పడుకుని నిద్రపోయాడు.

మళ్ళీ ఒకరోజు సాయంత్రం నరసయ్య "నారిగాడేడీ..." అంటూ కేకలు వేస్తూ వచ్చాడు "అలా అరుస్తారేమిటండీ... ఎవరన్నా వినిపోగలరు... బడి నుంచి ఇంటికి రాలేదుగా..." అంది వర్ధనమ్మ.

"బడి లేదు... బండలూ లేదు. మన నాగులు లేదూ... వాడి పిల్లలూ మన వంశోద్ధారకుడు కలిసి ఉప్పు కొలనులో ఈతలు కొట్టడానికి పోయారుట. వీడేమన్నా బాగుపడతాడా... అని."

"బాగుపడతాడా.... బాగుపడతాడా అని ఘడియ ఘడియకు మీరే హంసపాదులు పెడుతుంటే ఏమవుతుందండీ! అసలింతకీ కాలవ దగ్గరకు పోయాడని ఎవరు చెప్పారు? కిట్టని వాళ్లెవరో చెబితే ఆ మాట పట్టుకుని మీరింత గల్లంతు చేస్తుంటిరీ..."

"ఇదిగో... నువ్విలా వాణ్ణి వెనక వేసుకుని వచ్చావంటే... వాడి సంగతెలా ఉన్నా నీకు తగులుతాయి దెబ్బలు..."

"అయ్యోరాత.... ఇంత వయసువచ్చి ఇప్పుడు దెబ్బలు తినాలి... ఆ ముచ్చటం గూడా తీర్చుకోండి..." అంది వర్ధనమ్మ.

నరసయ్య తేలుకుట్టిన కోతిలా ఇంట్లో గందరగోళంచేసి "ఈ కొంపలో ఒకక్షణం ఉండలేను. ఎక్కడికన్నా లేచిపోతే బాగుండును..." అన్నాడు.

"లేచిపోతే అంతా కలిసేపోదాం... ముందు వాడెక్కడున్నాడో కొంచెం వెదుక్కుని రండి మీకు పుణ్యం ఉంటుంది..." అంది వర్ధనమ్మ.

"సరే వెతుక్కుని వస్తాను... డొక్క చీలుస్తాను వెధవని... అడ్డమైనవాళ్ళ తోనూపోయి... ఆ కాలవలో పడి కొట్టుకోవటమా..." అంటూ బుసలుకొడుతూ బయటకుపోయాడు.

'అబ్బ... ఉప్పెనయి వచ్చి పడిందే...' అంటూ ఉస్సురు మంది వర్ధనమ్మ.

నరసయ్య బయటకు వెళ్ళగానే నారాయణ ఇంట్లోకి మెల్లిగా వచ్చాడు. తండ్రి మాటలు విని హడలిపోయి పక్కసందులో దాక్కుని తండ్రి బయటకు పోగానే లోపలకు వచ్చాడు.

"ఇట్లారా నువ్వు..." అంటూ గదమాయించింది వర్ధనమ్మ. నారాయణ బిక్కుబిక్కుమంటూ వచ్చి నిలబడ్డాడు.

"ఎక్కడికిరా పోయింది..." వర్ధనమ్మ ముఖం ఎర్రబడింది.

"ఇంకెప్పుడూ పోనే...." అన్నాడు నారాయణ ప్రాణాలన్నీ బిగపట్టుకుని. "మీ రోగాలు పాడైపోను... ఏదైనా వస్తే చెయ్యలేక నేను చావాలి" అని చడామడా నాలుగు బాదింది నారాయణను. తల్లికొట్టే ధోరణిలో ఉందని తెలుసుకుని కొట్టకముందే ఏడుపు ప్రారంభించి దెబ్బలుపడగానే తారస్థాయి అందుకున్నాడు నారాయణ. లబో–దిబోమని పెంకు లెగిరిపోయేటట్లు ఏడుస్తుండేటప్పటికి పక్కింటి పిన్నిగారు వచ్చి "ఏమిటమ్మా మరీను... గొడ్డును బాదినట్లు బాదుతావు." అంటూ మందలించి పోయింది. వర్ధనమ్మ నారాయణ తడిసిన బట్టలు తీయించి ఒకమూల పారేసి వేడినీళ్ళ స్నానం చేయించి అన్నం పెట్టి పెరుగు వేసింది.

"ఈసారెప్పుడన్నా ఇట్లా పొయ్యావంటే... ముక్కలు విరగ్గొడతాను.... జాగ్రత్త..." అంది. నారాయణ ముఖం చింతాకంత చేసుకుని అన్నంతిని పిల్లిలాగా మంచం మీదకు పోయి పడుకున్నాడు.

నరసయ్య చీకటి పడుతుండగా ఇంటికి తిరిగి వచ్చాడు. "వెధవ ఎక్కడెక్కడ తిరుగుతున్నాడో ఏమిటో..." అన్నాడు. వర్ధనమ్మ మెల్లిగా వచ్చి "వాడు అన్నంతిని పడుకున్నాడుగాని... మీరుగూడా భోజనానికి లేవండి..." అంది. కొడుకు కనపడలేదన్న ఆవేదన ఒక క్షణంలో అదృశ్యమయింది. భగ్గున మండిపోతూ "ఎక్కడే వాడు..." అంటూ చిందులుతొక్కాడు.

"కొట్టటాలు, తిట్టటాలు అయినాయి లెండి...ఈసారెప్పుడన్నా మీరు కొడుదురుగాని భోజనానికి లేవండి..." అంది వర్ధనమ్మ.

నరసయ్య చిర్రుబుర్రులాడుతూ "సరే ఇంత తగలెయ్యి..." అంటూ వర్ధనమ్మ వెనకాలే పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వంటింట్లోకి వెళ్ళాడు.

"ఈ రకంగా అయితే వీడికి చదువు అబ్బదు... ఏదైనా ప్రైవేటు చెప్పించి హైస్కూలులో చేర్పించాలి..." అనుకున్నాడు నరసయ్య.

ప్రైవేటు మేష్టరు రోజూ రావటం మొదలు పెట్టాడు. నారాయణకు ఇల్లు కదిలే అవకాశం చిక్కటంలేదు.

"ఏమండీ... మావాడు ఎట్లా చదువుతున్నాడు...." అని మాష్టరుగారిని నరసయ్య ప్రశ్నించాడు ఒకరోజున.

"మీ అబ్బాయికేమండి వజ్రంలాంటివాడు .." అన్నారు మాష్టరుగారు.

"వజ్రంలాంటి వాడే అనుకోండి.... చదువు సంగతి నేను అడిగేది..." అన్నాడు నరసయ్య.

"చదువుకేమండి... మణి పూసలాంటి వాడు మీవాడు...."

"వజ్రాలు, మణులకేమి లెండి... చదువులో ఏమన్నా అభివృద్ధి కనపడతోందా..." అనండి నేనడిగేది..." నరసయ్య ముఖం చిట్లించి విసుక్కున్నాడు.

"ఆ...ఆ... అభివృద్ధి కాకేం... రత్నంలాంటి వాడు గదండి... వారం పది రోజుల్లో పదహారు ఎక్కాలు క్షుణ్ణంగా అప్ప చెప్పాడు..."

"పదహారు ఎక్కాలా... కర్మకాలా... ఈ ఎక్కాలు మీ దగ్గరకు రాకమునుపే వచ్చు గదండి..." అంటూ మండిపడ్డాడు నరసయ్య.

"రావని చెప్పాడే మీ అబ్బాయి" మాష్టారు గారు మాటలు సాగదీశారు.

"సరేకానివ్వండి..." అని "కర్మకొద్దీ దొరికారు... నెల పూర్తి కానివ్వండి..." అని మనసులో అనుకున్నాడు.

"అబ్బాయి బాగానే చదువుతున్నాడటగా..." అంది వర్ధనమ్మ ఎదురై.

"ఆ...ఆ.... చదువుతున్నాడు... అదే కనుక్కుని వస్తున్నా..."

"ప్రతి దానికి వెటకారమే... వెంటయింది...." అంది.

"అదొక్కటేగా చేతనయిన పని".

"నాకు అదన్నా చాతనయిందిగాదు" అంటూ వర్ధనమ్మ విస విసా నడచి వెళ్ళిపోయింది.

ఇంకో పది రోజులన్నా తిరక్కముందే ఈ ప్రైవేటు మేష్టారు దండుగ అని తీర్మానించుకుని ఆయనకు ఉద్వాసన చెప్పాడు.

"మళ్ళీ రమ్మంటే వస్తాను..." అన్నాడు మాష్టారు. వర్ధనమ్మ అక్కడే నిలబడి ఉంది "వెళ్ళొస్తానమ్మా...." అంటూ మర్యాదగా నవ్వుతూ నమస్కరించాడు.

ఆయన వెళ్ళగానే 'నా బొంద... నన్ను చూసి నవ్వుతాడెందుకు...' అనుకుంది వర్ధనమ్మ.

"వీడిని స్కూలుకి పంపి, ప్రైవేటు చెప్పించకపోతే చదువేమొస్తుంది..." అంది వర్ధనమ్మ ఆ రాత్రి అన్నాలు వడ్డిస్తూ.

"సంస్కృతం చెప్పించి చూస్తాను. అదీ అబ్బకపోతే ఒక రిక్షాకొని ఇస్తాను. అది లాక్కుని బ్రతుకుతాడు..." అన్నాడు నరసయ్య.

"అపనే చెయ్యండి... ఫలాని వారి అబ్బాయి రిక్షా లాక్కుని బ్రతుకుతున్నాడంటే మీకు

బోలెడంత ప్రతిష్ఠ నాకూ ప్రతిష్ఠ..." అంటూ కణతల మీద నొక్కు కుంటూ వెళ్ళిపోయింది.

"మరి ఏమిటి చెయ్యటం..." నరసయ్య కుప్పగా కూలబడిపోయి సంధి ప్రయత్నం కోసం తలపడ్డాడు.

"మీరే చెప్పండి... మీ మాట ఎప్పుడన్నా కాదన్నాను కనకనా..." అంది వర్ధనమ్మ.

"నువ్వు అవునన్నది ఎప్పుడు... ప్రతి దానికి అడ్డు మాట వెయ్యటం తప్పితే..."

"అయితే ఏం చెయ్యమంటారు..."

"అదే అడిగేది...."

వర్ధనమ్మ కొంచెం సేపాగి "పెళ్ళి చేస్తే పిచ్చి కుదురుతుందంటారు... నిజమేనా..." అంది. నరసయ్య మండిపడుతూ 'నీకేం కుదిరింది... నాకేం కుదిరింది...' అంటూ చివాలున లేచి పోయాడు.

"కనబడటంలా..." అంటూ వెళ్ళిపోయింది వర్ధనమ్మ.

ఆ రాత్రి చల్లగాలికి వరండాలో కూర్చున్న నరసయ్య వర్ధనమ్మ అన్న మాటలు పదే పదే వల్లించుకున్నాడు. పెళ్ళి చేస్తే కొంత దారిలోకి వస్తాడేమో అని గూడా అనుకున్నాడు.

"ఒసేవ్..." అంటూ పిలిచాడు.

'మళ్ళా ఏమొచ్చిందో గొడవ...' అనుకుంటూ బయటకు వచ్చింది.

"అదిగాదే... మనబ్బాయికి పిల్ల నెవరిస్తారంటావు..." అంటూ మెల్లిగా విషయంలోకి దింపాడు.

"మనబ్బాయి కేమండి బంగారం లాంటివాడు..." అంది వర్ధనమ్మ.

"అబ్బబ్బ... అది సరేనే..." అంటూ విసుక్కున్నాడు నరసయ్య.

"ప్రతి దానికీ విసుక్కోవటమే... కో..అంటే కోటి మంది పలుకుతారు. మా అన్నయ్య కూతుర్నిద్దామని మొట్టమొదటి నుంచి అనుకుంటునే ఉంటిరి"

"మనం పోయి అడిగితే, నామోషీగా వుండదూ..."

"అయ్యో రాత... మనం పోయి అడగాలిటండి.... ఏదో సందర్భంలో మా అబ్బాయికి పెళ్ళి చేద్దామనుకుంటున్నాం. అంటే వాళ్ళే బయటకు రారు...?" అంది వర్ధనమ్మ.

"సరే... సరే..." అన్నాడు నరసయ్య.

వర్ధనమ్మ ప్రాణం చల్లబడింది... ఆ రాత్రి భోజనాలయిన తర్వాత "బంగారు నాయనా" అంటూ తలనిమిరి దగ్గర పడుకోపెట్టుకునీ "నీకు పెళ్ళి చేస్తామంటున్నారురా మీ నాన్న..." అంది. నారాయణ గుండె గుబ గుబలాడింది.

"పెళ్లయితే ఎన్ని బాధ్యతలుంటాయో తెలుసా... బాగా చదువుకుని పెద్ద ఉద్యోగం చెయ్యాలి..." అంది వర్ధనమ్మ.

"అమ్మా... మరి పెళ్ళవుతే... ఇంక చదువులెందుకే..." అన్నాడు నారాయణ.

"నా బొంద... వీడికి ఇంక చదువొచ్చేదేమిటి..." అంటూ గొణుక్కుంది వర్ధనమ్మ.

(ఆనందవాణి)